కథ

# దూరపు కొండలు

- వలివేటి నాగచంద్రావతి

రైతుబజారు కూరగాయలమ్మి తట్ట ముందు వంగి బెండకాయల ముచ్చికలు ఒక్కొక్కటీ విరిచి జాగ్రత్తగా లేతవి ఏరుతున్నాను.

"సోనా" పిలుపు. ఉలిక్కిపడ్డాను.

'ఎప్పుడో కాలేజీ రోజులనాటి స్నేహం, స్వర్ణని ముద్దుగా సోనా అని మార్చినప్పటి ముచ్చట అది. ఇప్పుడు నన్నా పేరుతో పిలిచే దెవరబ్బా' సంభ్రమంగా తలతిప్పి చూశాను.

నాలుగడుగుల అవతల ఫ్రూటు షాపు దగ్గర్నుంచి చిరునవ్వుతో దగ్గరకొస్తోంది.

లేతరంగు డిజైనరు శారీ, కట్ చేసి భుజాలకు వదిలేసిన ఒత్తయిన జుట్టూ, కనబడీ కనబడనట్టుగా బుగ్గలకూ పెదాలకూ వేసుకున్న రంగూ, ఎంతో మోడ్రన్‌గా...

అయితేమటుకు- అయిదేళ్ళు కలిసిమెలిసి తిరిగిన నేస్తం. కాస్త ఆకారం, అహార్యం మారినంత మాత్రాన గుర్తుపట్టలేనా?

"నువ్వు... మీరూ... సంఘమిత్ర..గారు కదూ!" వంగున్నదాన్ని సరిగా నుంచుని తడబాటుగా అడిగాను.

"గారా... గోంగూరా - నేను మిత్రనే. మీరూ గీరూ అంటూ దూరం పెంచకు" అంది ఆమె ఆప్యాయంగా నా భుజంమీద చేయివేసి.

అప్పటికి సందిగ్ధం పూర్తిగా వదిలింది నాకు. "ఆ 'గారు' నీకోసం కాదులే. నువ్వు కట్టుకున్న చీర ఖరీదుకీ, నీ అలంకారానికీ" అన్నాను మందహాసం చేస్తూ.

పకపక నవ్వింది మిత్ర. "నీ చమత్కారం తగ్గలేదు స్నే" అంటూ.

"ఇవిగో అమ్మా మీరెంచుకున్న కాయలు. అరకేజీ తూగాయి" తక్కెడ వంచి బెండకాయల్ని నా చేతిలో ఉన్న సంచీలో వేస్తూ అంది కూరలమ్మి.

'ఫ్... తూచేటప్పుడు చూడనేలేదు' లోలోపల అనుకున్నాను కాస్త విచారంగా.

"సరె సరె. సంచి నిండిపోయింది. ఇక నీ కూరల బేరం అయిపోయినట్టేగా. పదపద, మా ఇంటికి వెడదాం" అంది మిత్ర.

నా ప్రమేయమేమీ లేదన్నట్టు నా చేతిలో కూరలసంచి లాక్కున్నట్టుగా తీసేసుకుంది. "మా డ్రైవర్ తీసుకొస్తాడులే" అని మా వెన కాలే పళ్ళబుట్టతో వస్తోన్న అతనికి అందించే సింది. మార్కెట్టు బయటకు వచ్చాక కూడా నా చెయ్యి వదిలిపెట్టలేదు మిత్ర.

"ఇంటి దగ్గర బాబు ఉన్నాడు. అత్తమ్మ నాకోసం ఎదురుచూస్తూ ఉంటారు" అని నేను అభ్యంతరం చెప్పబోయినా వినిపించుకోలేదు.

"ఊహు, ఎన్నేళ్ళకో కలుసుకున్నాం. నిన్ను వదలాలనిపించటం లేదు. ఒక్క గంట... ఒక్క గంటలో పంపించేస్తాను నిన్ను" అని బలవంతాన కారెక్కించింది.

మరీ బెట్టు చేయాలనిపించలేదు నాక్కూడా. ఎందుకంటే- కాలేజీ వదిలేదాకా నాలాగే సాదా సీదా మధ్యతరగతి ఆడపిల్లే తను కూడా. ఫైనుతో ఫీజు కట్టేవాళ్ళం. ఖరీదు తక్కువ చుడీదార్లు వేసుకునేవాళ్ళం. కిక్కిరిసిన సిటీబస్సుల్లో నిలబడి కాలేజీకి వెళ్ళేవాళ్ళం.

అలాంటిది- నేనేమో ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఇప్పటికీ ఆ కింది వరసలోనే ఉండిపోయానా- తనుమాత్రం కారూ, డ్రైవరూ... అంత ఎత్తుకు ఎలా వెళ్ళగలిగిందో తెలుసుకోవాలన్న కుతూహలం ఉండదా నాకు మరి.

కారు ముందుకు పరిగెడుతోంటే మేం వెనక్కు తిరిగి గత కాలంనాటి జ్ఞాపకాల్లోకి వెళ్ళిపోయాం.

కాలేజీలో శుభా, నేనూ, మిత్రా, గౌతమీ - మేం నలుగురం మంచి స్నేహితులం.

అద్మిషైన దగ్గర్నించీ కాలేజీ వదిలే పర్యంతం అయిదేళ్ళపాటు నిరాటంకంగా కొన సాగిన దోస్తీ మాది. అందుకు మా నలుగురి కామన్ ఐడెంటిటీ - మేమంతా మధ్యతరగతి వాళ్ళం కావటమే ముఖ్య కారణమను కుంటాను.





కలిసి క్యాంటీన్‌కి వెళ్ళేవాళ్ళం. కలిసే లైబ్రరీకి వెళ్ళేవాళ్ళం. పరీక్షల ముందు కలిసి కంబైన్డ్ స్టడీ చేసేవాళ్ళం. కాలేజీ నుంచి వచ్చేటప్పుడు బస్ కోసం స్టాపులో ఎదురు చూస్తూ మాటల్లోపడి రెండుమూడు బస్సులు మిస్ చేసేవాళ్ళం.

ఎంత మధురమైన రోజులో అవి. చీకూచింతా లేవు. అదిచేసే బాధ్యతల్లేవు. కట్టిపడేసే బాదరబందీల్లేవు. ఆపైన అందమైన కలలు కనే వయసు కూడా తోడయిందయ్యె. భవిష్యత్తు మీద గొప్ప గొప్ప ఆశలు. మా ఊహలూ, కట్టుకునే గాలిమేడలూ ఒకళ్ళ కొకళ్ళం ఏ సంకోచమూ లేకుండా హాయిగా సిగ్గుపడకుండా ఏ దాపరికమూ లేకుండా చెప్పేసుకునేవాళ్ళం.

వైట్ కోటూ, స్టెతస్కోపూ చూస్తే చాలు... మైమరిచిపోయేది గౌతమి. తను ఎలాగైనా ఎంబీబీఎస్ చదవాలి. ఎమ్మెస్సో ఇంకా ఆపైనో చదివిన ఇంకో డాక్టర్ని పెళ్ళాడాలి. సొంతంగా పెద్ద హాస్పిటల్ తెరవాలి. ఆ హాస్పిటల్ వరండాల్లో తనూ అతనూ వైట్ కోట్ వేసు కుని చేత్తో స్టెత్ పట్టుకుని హుందాగా నడిచి వెడుతుంటే అక్కడున్న రోగులూ, వాళ్ళ బంధు వులూ వినయంగా నమ స్కారాలు చేయాలి - ఇదీ గౌతమి స్వప్నం.

ఈ కలకే నగిషీలు చెక్కి, రకరకాల అలంకారాలద్ది మా చెవులు హోరెత్తిస్తుండేది.

శుభ తండ్రయితే ఒక పోస్ట్‌మేన్. ఆయనకో చెల్లెలు. అమెరికాలో స్థిరపడిన ఆ చెల్లెలికో కొడుకు. ఈ ఇండియాకీ, ఆ అమెరికాకీ వారధి వాళ్ళ తాతగారు. ఆయనే కూతురిని మేనరికానికి ఒప్పించి ఈ మనవరాలి భవి ష్యత్తు వక్షించిన విస్తరి చేశాట్ట. డిగ్రీ పూర్తి చేయటమేమిటీ, బావని పెళ్ళాడి అమెరికాకి ఎగిరిపోవటమే అనేది శుభ. సమయం దొరికితే చాలు అది అమెరికా గురించి కబుర్లే కబుర్లు. ఎంత అదృష్టవంతురాలో అని తను చూడకుండా నిట్టూర్చేవాళ్ళం.

ఈ మిత్రకి ఏ లక్ష్యమూ సాధించాలన్న పట్టుదలా లేదు. ఏ కష్టమూ పడకుండా వరుణ్ణి కుదిర్చిపెట్టే తాతా లేడు. కానీ, తన అదృష్టం మీద గొప్ప నమ్మకం మాత్రం ఉండేది. చిన్నప్పుడు తన చెయ్యి చూసి ఓ పేరొందిన జ్యోతిష్యుడు చెప్పాట్ట- ఈ పిల్ల మహర్జాతకురాలూ అని. ఆ మాట మీద గొప్ప గురి మిత్రకి.

కానీ, ఆ జోస్యం మీద ఏ మూలో తనకే సందేహం మిగిలుందేమోనని మా అను మానం. తన అదృష్టానికి ఢోకాలేదని చెబు తూనే ఏ కోయదొర కనబడ్డా చేయి చూపేది. చిలుకజోస్యం కూడా చెప్పించుకునేది. ఇంకా బలం కోసం గావును... మంగళవారం ఆంజనేయుడి గుడికీ, శనివారం వెంకన్న ఆలయానికీ వెళ్ళి ప్రదక్షిణలు చేస్తూండేది.

దాని పర్సులో అనేక దేవుళ్ళవీ, గుబురు జుట్టున్న బాబాలవీ, పెద్ద బొట్టున్న అమ్మలవీ... ఎన్ని ఫొటోలుండేవనీ- అప్పట్లో ఆ వెర్రిబాగులతనానికి దాని వెనకాల తెగ నవ్వుకునేవాళ్ళం. కానీ, ఇప్పుడు ఈ మిత్రని చూస్తే ఆ నవ్వుకున్న మేమే వెర్రివాళ్ళమనిపిస్తోంది.

"ఉహూ, గౌతమీ ఎక్కడున్నారో నీకు తెలీదు కదూ" అంటోంది మిత్ర.

ఉహూ, ఎలా తెలుస్తుంది? నా డిగ్రీ పూర్తి కావటం, మా నాన్నగారికి ట్రాన్స్ఫర్ రావటం ఒక్కసారే జరిగాయి. దాదాపు ఒరిస్సాకు దగ్గరగా వెళ్ళిపోయాం. ఓ అయిదారు నెలలు ఫోన్ టచ్‌లో ఉంటుండేవాళ్ళం. ఆ తరవాత మెల్లమెల్లగా వాళ్ళెవరో, నేనెవరో అన్నట్టుగా అయిపోయింది.

"గౌతమికి ఎంసెట్‌లో ర్యాంక్ రాలేదు. మాతోపాటే డిగ్రీ చేయక తప్పలేదు తనకి. అంతవరకే నాకు తెలుసును. అయితేనేం తనా తర్వాత ఓ డాక్టర్ని పెళ్ళాడిందట. శుభ అన్నట్టుగానే అమెరికా వెళ్ళిపోయిందట" చెబుతోంది మిత్ర.

అందరూ వాళ్ళు కోరుకున్నవీ, కావాలనుకున్నవీ సాధించుకున్నారన్నమాట. ప్చ్, నేనే- కారు స్లో అయింది.

★ ★ ★

వాచ్‌మేన్ తెరిచిన పెద్ద గేటులోంచి అటూ ఇటూ ఆకుపచ్చ సైనికుల్లా అటెన్షన్‌లో నుంచున్న అశోక వృక్షాలబాట మీంచి ఇంటి ముందు కారిడార్‌లోకి వచ్చి ఆగింది కారు. డ్రైవరు డోర్ తెరిచి పట్టుకుంటే హుందాగా కారు దిగి, "ఇదే మా ఇల్లు, దిగు" అని నన్నాహ్వానించింది మిత్ర.

సిటీ హడావుడికి కాస్త దూరంగా ఉన్న ఈ పోష్ కాలనీలో పెద్దపెద్ద ఆఫీసర్లూ, గొప్ప గొప్ప ధనవంతులూ నివాసముంటారని వినటమేగానీ- చూట్టం ఇదే మొదలు.

ఇల్లా అది... అధునాతనంగా కట్టిన పెద్ద బంగ్లా! భవనం చుట్టూరా ప్రత్యేక శ్రద్ధతో సంరక్షిస్తున్నట్టున్న అందమైన గార్డెనూ, సింహద్వారం ముందు పాలరాయి పరిచిన విశాలమైన వరండా.

ఆ వరండాలోనే ఓ పక్కన గొలుసుకి కట్టేసి ఉంది ఓ అల్సేషియన్. నన్ను చూసి లేచి అరవబోయి మిత్రని చూసి శాంతించింది. 'ఇది స్రామాట్. మావారి ప్రాణం" అంది మిత్ర చిరునవ్వుతో.

కాలొచ్చిన శబ్దానిగ్గావును... మధ్య వయసులో ఉన్న ఒకావిడ తలుపు తీసి మర్యాదగా చిరునవ్వు నవ్వింది.

"సీతమ్మగారు. మాకు వంటా అదీ చేసిపెడుతూంటారు" పరిచయం చేసింది మిత్ర. లోపలికి వెళ్ళాం.

"సీతమ్మగారూ, నా ప్రాణ స్నేహితురాలు తను. మంచి టిఫిను ఏదైనా వేడివేడిగా చప్పున చేసుకురండి."



వద్దు వద్దని నేనెంత వారిస్తున్నా వినిపించుకోకుండా పురమాయించింది. నన్ను బలవంతాన సోఫాలో కూలేసి తను వెళ్ళి రెండు కోకోకోలా టిన్నులు పట్టుకొచ్చింది. నాకొకటి అందించి పక్కన కూర్చుంది ఆ మాటా ఈ మాటా చెబుతూ.

తన భర్త ఓ ప్రముఖ వ్యాపారవేత్త అట. వారసత్వంగా సంక్రమించిన చిన్ని బిజినెస్‌నే తన సామర్థ్యంతో అతి తొందరలో నలుగురూ ఔరా అనుకునేట్టు అభివృద్ధి చేశాట్ట. ఈ సిటీలోనే అయిదారు ప్రాంతాల్లో తమ షోరూములున్నాయట. మేం కొత్తగా రాబట్టీగానీ ఇక్కడ ఆయన పేరు తెలీనివారుండరట.

ఘనుడైన భర్త గురించి గర్వంగా చెప్పుకోవడం భార్యకి ఇష్టంగానే ఉంటుంది మరి.

హ్మ్... మా ఆయన గురించి నేనేం చెప్పుకోగలను? పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చిన ఓ మారుమూల ఇంజినీరింగ్ కాలేజీలో అత్తెసరు మార్కులతో డిగ్రీ తీసుకుని ఓ పేరూ ఊరూ లేని కంపెనీలో ఏళుగా జాబ్ చేస్తున్నాడనా.. . వాళ్ళిచ్చే ఇరవైవేలే మహాభాగ్యమనుకుంటున్నామనా? సిగ్గుసిగ్గు.

తలెత్తబోతున్న జలసీని మందహాసంమాటున దాచేసి కోలా సిప్ చేస్తూ చుట్టూ చూశాను. చాలా పెద్ద హాలు అది. కార్నర్స్‌లో ఫ్లవర్‌స్టాండ్లూ, గోడలకానించి రోజ్‌వుడ్ టేబుల్సూ, వాటిమీద షోపీసులూ, ఓ మూల అక్వేరియం, గోడలకి అక్కడక్కడా ఆయిల్ పెయింటింగ్సూ, సీలింగుకి షాండ్లియర్సూ.. మొత్తంమీద హాలే ఓ కళాఖండంలా ఉంది.

"చాలా బావుంది" అన్నానప్రయత్నంగా.

"అంతా మావారి సెలక్షన్ అండ్ కలెక్షన్. ఉండేది ఇద్దరమే అయినా వీటి కోసమే ఇంత పెద్దిల్లు కట్టించుకున్నాం. దా, నీకిల్లంతా చూపిస్తా... ఉత్సాహంగా లేచింది మిత్ర. ఈలోపల సీతమ్మగారి పని కూడా అయిపోతుంది" అంటూ నాకు చెయ్యందించింది.

'ఇంకేం గొప్పలు చూపించుకుంటుందో- తప్పుతుందా' కాస్తంత దుగ్ధగా అనుకుంటూనే వెంట నడిచాను.

అబ్బా... ఎన్ని గదులో! నాలుగు పడగ్గదులూ, హోమ్‌థియేటర్ పెట్టిన పెద్దగదొకటీ, ఊరంత డైనింగ్‌రూమూ, మైదానమంత వంటిల్లూ, పూజకో గది.

"మావారికి ఇరుకు ఇరుగ్గా ఉండటం అసలు నచ్చదోయ్. బాత్‌రూమ్ కూడా హాలంత ఉండాలంటారు" మామూలుగా చెప్పినట్టే ఉంది- నాకుమాత్రం డాబుసరిగా చెప్పినట్టే వినిపించింది.

ఒక్కటొక్కటిగా తిప్పి చూపిస్తూ వాటిల్లో అమర్చిన, అలంకరించిన వస్తువుల ప్రత్యేకతనీ, ప్రాముఖ్యతనీ, ఆధునికతనీ వర్ణించి వర్ణించి చెబుతోంది నాకు.

"ఇవి ఫ్రెంచ్ విండోస్. పాత మోడలేగానీ ఎంత దర్జాగా ఉన్నాయో చూశావా. ఈ కర్టెను ఖాత్ ముంబయి నుంచి తెప్పించాం. ఈ రోజ్‌వుడ్ కాట్సు రాజస్థాన్ నుంచి కార్పెంటర్ని పిలిపించి చేయించారు. ఆ డ్రెస్సింగ్ టేబుల్సూ, ఆ బట్టల అల్మారాలూ, మిగతా ఫర్నిచరూ అన్నీ వాళ్ళు చేసినవే. ఆ నగిషీలూ అవీ... మనవైపువాళ్ళకి ఈ నైపుణ్యం రాదు అంటారాయన."

ఇవేకాదు, తన భర్తగారు ఏవి కొన్నా అపురూపంగా ఉండాల్సిందేనట. ఆ మిర్రర్లూ, కార్పెట్లూ, మంచాలమీది బెడ్‌షీట్లూ, చివరికి డోర్‌మ్యాట్లు కూడా నెట్లో వెతికి వెతికి ఇండియావి నచ్చకపోతే ఫారిన్ నుంచైనా తెప్పించేస్తారటగానీ రాజీపడరట. "బజార్లోకి కొత్తగా ఆకర్షణగా ఏవి కనబడ్డా ఇంట్లో ఉండాల్సిందే అనుకో" అక్కడలేని మొగుణ్ణి తల్చుకుని ఆరాధనగా కళ్ళు మెరిపిస్తోంది మిత్ర.

నిట్టూర్చాను. ఇవన్నీ చూస్తోంటే అతగాడి టేస్టుని మెచ్చుకోకుండా ఉండలేం. చివరికి వంటిల్లు... ఉహూ ఆ మాడ్యులర్ కిచెన్.

## కలం కదిలించండి

సృజనాత్మకత కలిగిన రచయితలకూ రచయిత్రులకూ ఇదే ఆహ్వానం. మానవ జీవితంలోని వివిధ పార్శ్వాలను స్పృశిస్తూ మధురమైన అనుభూతులను పాఠకులకు పంచే కథలకు 'ఈనాడు' స్వాగతం పలుకుతోంది. బాణీ ఏదైనా... కథనంలో వైవిధ్యం, పాఠకులను ఏకబిగిన చదివించగలిగే బిగువూ ఉండాలి. ఆశావహ దృక్పథంతో సాగే కథలకు ప్రాధాన్యం. కథ సాధారణ చేతి రాతలో ఏడు అరఠావులకు మించకూడదు.

కథలు పంపాల్సిన చిరునామా:

**ఆదివారం అనుబంధం**
ఈనాడు కాంప్లెక్స్, సోమాజిగూడ,
హైదరాబాద్-82.

సెంటర్ ఫ్లాట్‌ఫాంతో ఎంత గొప్పగా, ఎంత సదుపాయంగా ఉందో- నిజంగా ఇల్లాలికి వరప్రసాదంలా ఉందా కిచెన్.

అయినా మిత్రకి వంటగదిలో అడుగు పెట్టే అవసరమేముందిలే.

హ్మ్... దేనికైనా పెట్టి పుట్టాలి. మా ఆయనా ఉన్నాడు- తను వేసుకునే చెప్పులు కూడా సరైన సైజువి తెచ్చుకోలేడు. ఇవి మీ కాళ్ళకి నప్పవండీ అని నేను చెప్పాలి- ఖర్మ!

తనకున్న వందలాది చీరెల్నీ, ఫ్యాషన్ జ్యూయలరీని చూపిస్తూ "సంపాయించడం కాదు- అనుభవించటం నేర్చుకోవాలంటారు మావారు" మురిపెంగా అంటోంది మిత్ర.

'మాకా బాధలేదు. ఎందుకంటే అసలు సంపాయించటమే చేతకాదుగా మాకు.'

"ఏమిటే- ఆరేళ్ళకే ఇద్దరు పిల్లలా? టూ బ్యాడ్. హుషారైన వయసంతా వాళ్ళ పెట్టే చికాకుల్తో చేతులారా వృథా చేసుకోవటమేగా. మేం చూడు, ఎన్ని బ్యూటిఫుల్ ప్రాంతాల్లో ఎంజాయ్ చేసి వచ్చామో" అంటోంది మిత్ర పెద్ద ఆల్బమ్ ఒకటి ముందు పడేసి.

అవన్నీ చూస్తుంటే, ఆ మాటలు వింటూంటే బతుకులోని మాధుర్యాన్ని పోగొట్టుకున్నట్టూ, ఎంత వెతుక్కున్నా ఇక దొరకదన్నట్టూ - నిస్పృహ, నిరాశ.

ఇప్పుడీ మిత్ర పొందినవన్నీ ఒకనాడు నేను కావాలనుకున్నవి. అలవోకగా అందుకోగలననుకున్నవి.

అవును, నాకేం తక్కువ. అందాలభరిణని. బంగారుబొమ్మని. కాలేజీ బ్యూటీని. చదువులో ఏవరేజ్ అయితేనేమి, అసలైన నా క్వాలిఫికేషన్ నా అందమే.

నాకున్న సౌందర్యానికి ఏ మాజీ జమీందారు ముద్దుల మనుమడో, ఏ బిజినెస్ మాగ్నెట్ గారాలపుత్రుడో - నన్ను చూసి కలవరించి, వెంటతిరిగి నన్ను చేపడతాడని ఎదురుచూసినదాన్ని.

అచ్చం అలానే నౌకర్లూ చాకర్లతో సేవలు చేయించుకుంటూ మహారాణిలా కార్లలో తిరగాల్సినదాన్ని.

నా రాత బావుండక కన్న కలలన్నీ కల్లలయి పోయి ఇలా ఆత్తెసరు బతుక్కి బలైపోయాను. ఇంకొకర్ని చూసి అసూయపడే దుస్థితికి దిగజారిపోయాను.

ఇంటికెలా వచ్చానో తెలీదు. తలుపు తీసిన అత్తమ్మని చూస్తే చెడ్డచిరాకనిపించింది.

"ఇంతాలస్యమయిందేమే" అని ఆవిడం టూంటే చిర్రెత్తుకొచ్చింది.

'ఇంట్లో బైనాతీలా అత్తగారా- అబ్బ, ఎలా భరిస్తున్నావే. మేం మా పేరెంట్స్‌కి డబ్బు పంపించేస్తాం. వాళ్ళకామాత్రం సహాయం చేస్తే చాలు' అంటారాయన అన్న మిత్ర మాటలే గుర్తొచ్చి.

తప్పటడుగులు వేసుకుంటూ వచ్చి కాళ్ళు చుట్టేశాడు చిన్నూ. విసుగ్గా విదిలించేశాను.

రాగం తీస్తున్న వాణ్ణెత్తుకుంటూ "ఏమయిందే నీకూ" ఆశ్చర్యపడ్డారత్తమ్మ.

"నా శ్రాద్ధమయింది" చిరచిరలాడాను.

కోపం... నామీద నాకే కోపం. అస్థిమితం. అతలాకుతలం. అంతా కక్షగట్టి నన్ను మోసం చేశారనిపిస్తోంది. పెళ్ళి పెళ్ళంటూ నాన్నని ఊదరకొట్టేసిన అమ్మ, ఇంజినీరనంగానే ఇంకేముంది... అమెరికా ప్రెసిడెంటన్నట్టుగా సంబరపడిపోయిన నాన్న, తగినవాళ్ళేనా అనన్నా ఆలోచించకుండా తగుదునమ్మా అని తాళి కట్టేసిన ఈ మహానుభావుడు... అంతా... అంతా... నాకు శత్రువులే అనిపిస్తోంది.

సాయంత్రం బబ్లూగాణ్ణి వాయగొట్టాను - స్కూల్లో బట్టలు మాపుకొచ్చాడని. 'టీలో అల్లం వెయ్యలేదా' అన్నందుకు మా ఆయన మీద విరుచుకుపడ్డాను. 'ఇష్టమొచ్చినట్టల్లా చేసిపెట్టడానికి వంట మనుషులెవరిక్కడ' అంటూ రంకెలేశాను.

"స్వర్ణ మనసేం బాలేనట్టుందమ్మా. తనకేం



పనైప్పుకు" అని ఆయనా... "మరే, ఒళ్ళు పసి చెడినట్టుంది. పిచ్చిమొహం, ఎప్పుడు చూడు... చేసింది చేసినట్టే ఉంటుంది విశ్రాంతి తీసుకోకుండా" అని అత్తమ్మా సానుభూతి చూపించేశారు. పిల్లల్ని సముదాయించేశారు. నాకదీ కూడా నచ్చలేదు. వీళ్ళెందుకు పోట్లాడరు? అప్పుడయితే కసితీరా నేనూ అరుద్దును కదా అనే అనిపించింది.

నాలుగురోజుల్దాకా కల్లోల సముద్రంలానే ఉంది మనసు.

★ ★ ★

"ఇంట్లో కూరలైపోయాయమ్మా స్వర్ణా" అన్నారత్తమ్మ కొంచెం జంకుతున్నట్టు.

'నావల్ల కాదిప్పుడు' అని కసురుదామనుకున్నానుగానీ బయటకువెడితేనన్నా కాస్త తెరపిగా ఉంటుందనిపించి, సంచి తీసుకుని బయల్దేరాను.

ఎంట్రెన్స్‌లోనే ఎదురుపడింది సీతమ్మగారు "బావున్నారా" అని పలకరించింది నవ్వుతూ.

"బావున్నాను. మిత్ర ఏం చేస్తోంది?" కాజువల్‌గా అడిగాను, 'హాయిగా పర్సు నిండా డబ్బు వేసుకుని ఏ షాపింగ్‌కో వెళ్ళుంటుంది' అని దుగ్ధగా అనుకుంటూ.

"ఏం చేస్తుందమ్మా, మూలుగుతూ పడుకుంది. ఆ మాయదారివాడు వచ్చివెళ్ళాడుగా- ఒళ్ళంతా హూనం చేసి" అంటోంది సీతమ్మగారు మొహం అదోలా పెట్టి.

స్తన్నయ్యాను. 'ఏమంటోందీవిడ' వచ్చిపోయేవాళ్ళకి అడ్డంలేకుండా కాస్తంత పక్కగా వెళ్ళాం.

"మీకు తెలీదమ్మా, అతగాడు వచ్చినప్పుడల్లా ఇంతే! తెగ తాగుతాడు. పిచ్చికుక్కలా ఇల్లంతా కంగాళీ చేస్తాడు. ఉన్న ఆ నాలుగు రోజులూ ఆవిడ ఒళ్ళంతా చితక్కొట్టిపోతాడు, రాక్షసుడు" అన్నదావిడ మొహం పేహ్యంగా పెట్టి.

'హరి భగవంతుడా, నేను వింటున్నది నిజమేనా? నాలుగురోజులా- మరి మిగతా రోజుల్లో?' నాలిక మీద తడి ఆరిపోతూండగా అడిగాను. అసలే నాకు కొట్టే మగాళ్ళంటే చాలా భయం.

"అయ్యో రామ, మీకు తెలీదా? అసలు సంసారం వేరే ఉందిగా. బిడ్డా పాపా అక్కడ. తాగి తందనాలాడ్డమూ సరదాలు తీర్చుకోటమూ ఇక్కడ. ఎలా పడిందో ఈ భ్రాష్టుడి వల్లో. పాపం, మంచి కుటుంబం నుంచే వచ్చిందనుకుంటా."

'మరి పెళ్ళీ అదీ...' నా అనుమానం.

"ఆ... ఓ పసుపుకొమ్ము కట్టే ఉంటాడు- ఎందుకదీ? ఆ నగలూ, చీరలూ చూసుకుని మురిసిపోతున్నట్టు నటించటానికే తప్ప. ఓ బిడ్డ కలిగే యోగం లేదు. ఓ ముట్టం, పక్కం వచ్చి పలకరించే ఆస్కారం లేదు. ప్చ్, కొందరి బతుకులు ఇంతేనమ్మా. మోడుల్లా... అదిగో ఆ కాయితం పూలల్లే..."

మిగతా మాటలేమీ నాకు వినిపించలేదు. గిరుక్కున వెనక్కి తిరిగాను. 'బుద్ధుందా నాకు- ఇదా నాకు దక్కలేదని బాధపడ్డానింతవరకూ' పశ్చాత్తాపంతో ముడుచుకుపోతోంది మనసు. 'నా కోపతాపాల్లో సైతం నన్నర్థం చేసుకునే భర్తా, ముత్యాల్లాంటి బిడ్డలూ, ఆదరించే అత్తగారూ, నా ఇల్లెంత స్వర్గం- ఈమాత్రం తెలీలేదేం నాకు.'

ఖాళీ సంచితో వచ్చిన నన్ను "అదేమిటే?" అనడుగుతున్న అత్తమ్మను చేతులతో చుట్టేసి భుజం మీద చుబుకం ఆన్చాను అభిమానంగా. ఉయ్యాలలో నిద్రపోతున్న చిన్నూని గబుక్కున లేపి అమాంతం పైకెగరేసి పట్టుకున్నాను.

బేరుమంటున్న వాణ్ణి నా చేతుల్లోంచి లాక్కుని "పిచ్చిగానీ పట్టిందా ఏమే" నా చేష్టలకి విస్తుపోతూ అంటున్నారత్తమ్మ కోపంగా.

"పట్టలేదు. పట్టింది వదిలింది" అన్నాను కన్నీళ్ళు ఉబుకుతోంటే. ★